అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

తెలంగాణ కుంభమేళా

జనసంద్రంగా మేడారం

గద్దెల వద్దకు చేరిన తల్లులు

మొక్కుల తీర్చుకునేందుకు భక్తుల బారులు

లక్షలాదిగా పోటెత్తిన జనం

అక్షర దర్బార్, మేడారం: తెలంగాణ కుంభమేళ జన సంద్రమైంది. వన దేవతలు సమ్మక్క సారలమ్మను దర్శించుకోవడానికి తెలంగాణ సహ వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది భక్తులు మేడారం చేరుకుం టున్నారు. జాతర పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మేడారం అటవీ ప్రాంతం పూర్తిగా జనంతో నిండిపోయింది. ఎటు చూసినా కను చూపు మేర విడిది చేసిన భక్తులే కనబడుతు న్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో నాలుగు రోజులపాటు వైభవంగా జరిగే సమ్మక్క సారలమ్మ మహా జాతర బుధవారం ప్రారం భమైన విషయం తెలిసిందే. సమీపంలోని కన్నెపల్లి నుంచి పూజారులు సారలమ్మను బుధవారం రాత్రి మేడారంలోని గద్దెపైకి చేర్చడంతో మహా జాతరలో తొలి ఘట్టం ముగిసింది. కన్నెపల్లి నుంచి బయల్దేరిన సారలమ్మకు స్వాగతం పలికేందుకు భక్తులు పోటీప డ్డారు. సారలమ్మ గద్దెకు చేరుకోగానే అప్పటి వరకు వేచి ఉన్న భక్తులు ఒక్కసారిగా దర్శనం కోసం గద్దెల ప్రాంగణం దారి పట్టారు. దీంతో గద్దెల ప్రాంగణం వద్ద ఉన్న క్యూ లైన్లు భక్తులతో కిటకిటలాడాయి. సారలమ్మ గద్దెపై కొలువు తీరగానే మేడారంలో భక్తజన సందోహం మరింత పెరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటు న్నారు. తమను చల్లంగా దీవించాలని అమ్మవార్లను కోరుకుంటున్నారు. పగిడిద్దరాజు, గోవిందరాజులను కూడా భక్తులు దర్శించుకుంటున్నారు.

- జంపన్న వాగు వద్ద స్నానం

తమ ఇలవేల్పులైన సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి ముందు భక్తులు జంపన్న వాగు వద్ద స్నానం ఆచరిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం జంపన్న వాగు వద్ద ఇరువైపులా బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేసింది. దీంతో మేడారం చేరుకుంటున్న భక్తులు మొదట జంపన్న వద్దకు వెళ్లి పుణ్య స్నానం ఆచరిస్తున్నారు. ఆ తర్వాత నేరుగా మేడారంలోని గద్దెల ప్రాంగణం వద్దకు చేరుకొని తమ ఇష్ట దైవాలైన సమ్మక్క సారలమ్మను దర్శించుకుంటున్నారు.

- గద్దెపైకి చేరిన సమ్మక్క

రెండో రోజు మేడారంలో భక్తులు పోటెత్తారు. గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి పూజారులు ప్రభుత్వ లాంఛనాల మధ్య సమ్మక్కను తీసుకుని మేడారం బయల్దేరారు. తల్లికి స్వాగతం పలికేందుకు భక్తులు పోటీపడ్డారు. భక్తులను అదుపు చేయడం పోలీసులకు తల ప్రాణం తోకలోకి వచ్చినంత పని అయింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ పూజారులు సమక్కను రాత్రి గద్దెపైకి చేర్చారు. దీంతో మహా జాతరలో అతి కీలకమైన రెండో ఘట్టం ముగిసింది. సార్లమ్మతోపాటు సమ్మక్క కూడా గద్దెలపై కొలువు తీరడంతో మేడారంలో భక్తుల రద్దీ మరింత పెరిగింది. తెలంగాణతోపాటు చత్తీస్ గడ్, ఒడిశా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో మేడారం మహా జాతరకు వస్తున్నారు. వన దేవతలను దర్శిం చుకుని తన్మయత్వం చెందుతున్నారు. గురువారం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మేడారం చేరుకుని సమ్మక్క సారలమ్మను దర్శించు కున్నారు. తన ఎత్తు బంగారాన్ని సమర్పించారు. ఆయన వెంట రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఉన్నారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ గా పని చేసిన జంపన్న వాగు జంట వంతెనల రూపకర్త ప్రభాకర్ రెడ్డితోపాటు పలువురు వీఐపీలు గురువారం అమ్మవార్లను దర్శించుకున్నారు.

- నేడు వీవీఐపీల రాక

సమ్మక్క సారలమ్మ జాతరకు శుక్రవారం పలువురు వీవీఐపీలు రానున్నారు. కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా ఈ నెల 23న మేడారం సందర్శిస్తా రని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర గవర్నర్ మేడారం చేరుకుని సమ్మక్క సారలమ్మను దర్శించు కుంటారని, ఆమె మేడారం రావడం ఇది మూడోసారి అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు మేడారం చేరుకొని అమ్మవార్లను దర్శించుకుంటారని మంత్రి సీతక్క ఇదివరకే ప్రకటించారు. తల్లులు ఇద్దరూ గద్దెలపై కొలువు తీరడం వల్ల శుక్రవారం మేడారం చేరుకునే భక్తుల సంఖ్య కూడా మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రం ఏర్పాట్లు చేపట్టింది. శనివారం సాయంత్రం సమ్మక్క సారలమ్మ వన ప్రవేశంతో మహా జాతర ముగియనుంది.

లక్ష్మణా.. తగునా

జాతర పాసులు అందక జర్నలిస్టుల అవస్థలు

చర్చనీయాంశమైన 1650 పాసుల అంశం

అక్షర దర్బార్, హనుమకొండ: మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర పాసులు అందకపోవడం వల్ల జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మునుపెన్నడూ లేని రీతిలో ఈసారి జాతర పాసుల కోసం అనేక అవస్థలు పడుతున్నారు. సమాచార శాఖలోని కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం లోని మేడారంలో రెండేళ్లకోసారి నాలుగు రోజుల పాటు మహా వైభవంగా జరిగే సమ్మక్క సారలమ్మ మహా జాతర బుధవారం ప్రారంభమైంది. ఈ జాతర కోసం ప్రతిసారి సమాచార శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జర్నలిస్టులకు వీవీఐపీ, వీఐపీ పాసులను ఇన్నాళ్లు అందజేసింది. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పడిన ఆయా జిల్లాలోని డిపిఆర్ఓలు తమ జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు జాతర పాసులను అందజేశారు. ఈసారి జాతర పాసులను జర్నలిస్టులకు అందజేయడంలో గతంలో అమలు చేసిన విధానాన్ని సమాచార అధికారులు మార్చారు. ములుగు కేంద్రంగా జర్నలిస్టులకు జాతర పాసులను అందజేయాలని తాజాగా నిర్ణయిం చారు. దీన్ని పక్కాగా అమలు చేయకపోవడం వల్ల జాతర పాసులు అందగా జర్నలిస్టులు చాలామంది ఇక్కట్లు పడుతున్నారు. సమాచార శాఖలోని అధికా రులు మాత్రం నెపాన్ని ఒకరిపై ఒకరు నేడుతూ సమస్యను దాటేస్తున్నారు.

- ఆ పాసులపై చర్చ

ముఖ్యంగా జర్నలిస్టుల కోసం ప్రభుత్వం నుంచి తమ ఆధీనంలోకి తీసుకున్న జాతర పాసులను జారీ చేయడంలో సమాచార శాఖలోని అధికారులు కొందరు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలుస్తుంది. ఉదాహరణకు ఓ అధికారి హనుమకొం

డలో జర్నలిస్టులకు అందజేయడం కోసం ములుగులో 1650 జాతర పాసులను పొందినట్లు తెలిసింది. వీటిలో వీవీఐపీ, వీఐపీ జాతర పాసులు ఉన్నట్లు సమాచారం. ఆయన వీటిని ఆయన హన్మ కొండలో తనకు అనుకూలంగా ఉండే ప్రింట్, ఎల క్ట్రానిక్ మీడియాలోని కొందరు ముఖ్యులకు మాత్రమే అందజేశారు. ఒకటి రెండు కాదు కొందరికి పదుల సంఖ్యలో వివిఐపి, వీఐపీ పాసులను ఇచ్చారు. ప్రభు త్వంలోని పెద్దలకు తన గురించి మంచిగా చెప్పారని వారిని సంతృప్తి పరిచారు. వివిధ పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తున్న చాలామంది జర్నలిస్టులకు మొండిచేయి చూపారు. హనుమకొండ, వరంగల్ తోపాటు ఇతర జిల్లాల్లోని జర్నలిస్టులకు చాలామం దికి జాతర పాసులు ఈసారి అందలేదు. అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు కూడా సదరు అధికారి ఇవ్వలేదు. ఇక డిజిటల్, ఈ పేపర్, యూట్యూబ్ ల జర్నలిస్టు లను తన దగ్గరకు కూడా రానీయలేదు. జాతర పాసుల కోసం తనను సంప్రదించిన జర్నలిస్టులకు తాను బదిలీ అయ్యానని, కొత్తగా వచ్చిన అధికారిని సంప్రదించాలని చెప్పారు. కానీ ఆయన తన వద్ద పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తులతోపాటు జర్నలిస్టులు కాని ఇతర వ్యక్తులకు జాతర పాసులు అందజేయడం వల్ల మార్కెట్ లో వ్యాపారులు సహ చాలామంది ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి జాతర వివిఐపి, వీఐపీ పాసులు చేరాయి. చివరకు ప్రైవేట్ వ్యక్తులే జాతర పాసులు జర్నలిస్టులకు ఇస్తున్నారంటే పరిస్థితి అవగతం కాగలదు. దీంతో జర్నలిస్టులు సమాచార శాఖలోని అధికారులను ఫోన్ ద్వారా సంప్రదిస్తే తమ వద్ద జాతర పాసులు లేవని, హనుమకొండలోని అధికారిని సంప్రదించాలని చెప్పి సమస్యను దాటేస్తు న్నారు. కొందరు అధికారులు జర్నలిస్టుల ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదు. దీంతో ఇప్పుడు అసలు ములుగు నుంచి హనుమకొండలో జర్నలిస్టులకు పంపిణీ చేసేందుకు అధికారి తన ఆధీనంలోకి తీసుకున్న 1650 జాతర పాసులు ఏమైనట్లు అనే అంశంపై ప్రస్తుతం మీడియాలో చర్చనీయాంశ మైంది. ప్రభుత్వంలోని పెద్దలు పట్టించుకోకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కావడం ఇపుడు హాట్ టాపిక్ గా మారింది.